క్లుప్తంగా

60 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత



వ్యాన్‌తో పట్టుబడిన బియ్యం

సీతంపేట: మండలంలోని చిన్నరామ జంక్షన్ వద్ద 60 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జగదీష్ నాయుడు గురువారం తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో దోనుబాయి నుంచి సీతంపేటకు పికప్ వ్యాన్‌తో 2,269 కిలోల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. సీజ్ చేసిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ గొడౌన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన



బలిజిపేట ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జెండర్‌పై అవగాహనా కార్యక్రమాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్త్రీ, పురుషుల సమానత్వం, గృహహింస లేకుండా చేయడం, బాల్య వివాహాలు అరికట్టడం, మహిళావేధింపులు లేకుండా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులచేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఓఏలు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



భక్తులకు దర్శనమించ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజించడానికి సిద్ధం చేయడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా స్వామి దర్శనానికి క్యూకట్టారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులతో ముడుపులు చెల్లింపు, క్షీరాభిషేకాలు, కుంకుమపూజలను అర్చకులు చేయించారు. ఉపవాసాలతో ఆలయానికి చేరకున్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాల వితరణ చేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రుద్రాక్షలతో పూజలు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని దాడితల్లి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కాశీ నుంచి తెప్పించిన 1,108 రుద్రాక్షలతో పురోహితులు పిండిప్రోలు మణికుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు చేశారు. దేవుని అనుగ్రహం రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి: స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీన జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, కళాశాల కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 13 కంపెనీలు 1200 ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందని, పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి-ఫార్మసీ, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి విజయనగరం, విశాఖపట్నం, తుని, కడప, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్‌లో ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజలకు మేలు



వీరఘట్టం: కత్తులకవిటిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎంపీపీ దమలపాటి



కొమరాడలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గంగమ్మ, ఎంపీపీ శ్యామల తదితరులు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమంతో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గురువారం పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి, పార్టీని గెలిపించాలని కోరుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తగూడ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వెళ్తున్న కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు) విద్యార్థులు నిమ్మల రిమంత్, బిడ్డిక హర్షవర్ధన్, మండంగి శేఖర్, మండంగి కార్తిక్‌తో పాటు జొల్లగూడ గ్రామానికి చెందిన నిమ్మల జితేంద్ర ఎంపికైనట్లు పాఠశాల పీడీ నిమ్మల మాధవరావు గురువారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నంద్యాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వీరంతా పాల్గొంటారన్నారు. వీరంతా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో అక్టోబర్ 7వ తేదీ నుంచి జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొని, ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

'దిశ'తో మహిళలకు రక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: ప్రభుత్వం చేసిన దిశ చట్టం, రూపొందించిన దిశ యాప్‌తో మహిళలకు రక్షణ కలుగుతోందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్ బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దిశ యాప్ వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ లావణ్య తొలుత దిశ చట్టంలోని ముఖ్యాంశాలు, యాప్ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో యాప్‌ను ఆశ్రయిస్తే 10 నిమిషాల్లో పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి, రక్షణ కల్పిస్తారన్నారు. ఆడ,మగ తేడా లేకుండా అందరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూ కో–ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు ఎం.శాంతి, కె.శ్రీనివాసరావు, సీహెచ్ రాఘవేంద్రనాయుడు, ఎం.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్ కృష్ణమనోహర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 22 గ్రామ సచివాలయాల సిబ్బందికి గురువారం రీ ఫ్రెష్‌మెంట్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన, ఎంపీడీవో డొంక త్రినాథులు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాసమస్యలు సకాలంలో పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, సమస్య పరిష్కారం కాకపోతే ఆ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో సంబంధిత ఫిర్యాదు దారుకు తెలియజేయాలన్నారు.

బత్తిలి ఎస్ఐగా ప్రసాదరావు

భామిని: మండలంలోని బత్తిలి ఎస్ఐగా సీహెచ్ ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గరుగుబిల్లి నుంచి ఈయన బదిలీపై రాగా, ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన వై.అమ్మానరావు గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా విధుల్లో చేరిన ప్రసాదరావుకు ఏఎస్ఐ గురుమూర్తి, సిబ్బంది కలిసి ఘనస్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

పాముకాటుతో మహిళ ఇమృతి

రేగిడి: మండలంలో సరసనాపల్లి గ్రామానికి చెందిన కుప్పల నారాయణ అనే మహిళా రైతు పాము కాటుతో మృతి చెందింది. గురువారం ఉదయం పంట పొలంలో వరి పనలు ఆరబెడుతుండగా.. పాము కరవడంతో ఆమెను 108 వాహనంలో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

అధికారుల పరిశీలన

బొబ్బిలి: మండలంలోని కారాడ, పిరిడి ప్రాంతాల్లోని రక్షిత మంచినీటి పథకాలతో పాటు వాటికి నీటిని తీసుకువెళ్లే మోటార్ పంపులను ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పీఎంకే రెడ్డి, ఏఈ శ్రావణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మిచాంగ్ తుపాను వర్షాల కారణంగా ఎక్కడైనా ఏవైనా దెబ్బతిన్నాయా లేదా అనే విషయం గమనించామని, అంతా బాగానే ఉందని వారు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు హెపటైటిస్ పరీక్షలు

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో గల ఏఆర్‌టీ సెంటర్‌లో గురువారం ట్రాన్స్ జెండర్లకు హెపటైటిస్ బి,సి పరీక్షలను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం హెపిటైటిస్ బి.వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు ఉచితంగా హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎయిడ్స్ లాంటి వ్యాధులకు గురికాకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపడుతోందన్నారు.

చి'వరి' జాగ్రత్తలు

- ధాన్యం భద్రపరచడంలో జాగ్రత్తలు తప్పనిసరి
- మెలకువలు పాటించకుంటే ధాన్యం పాడయ్యే అవకాశం
- వ్యవసాయాధికారుల సూచనలతో పంట రక్షణ
- అప్రమత్తం కావాలని అన్నదాతలకు అధికారుల సూచన





రాజుపేట వద్ద యంత్ర సాయంతో వరికోత చేస్తున్న రైతు(ఫైల్) (ఇన్‌సెట్లో) గొడౌన్‌లో భద్రపరిచేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు

పాలకొండ రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకోవడంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న వారు చేతికి వచ్చిన పంటను పాడైతే వారు పడే బాధ వర్ణనాతీతం. ప్రస్తుతం ఖరీఫ్ సాగులో భాగంగా పండించిన వరి పంట ప్రస్తుతం మెల్లమెల్లగా కళ్లాల్లో నూర్పులు తర్వాత ఇంటికి ధాన్యం చేరుతోంది. ఈ క్రమంలో ధాన్యం గింజలు భద్రపరుచుకోవడం ముఖ్యమని వ్యవసాయాధికారులు, నిపుణులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన సాగు అయిన వరి పంట చివరి దశకు చేరుకుంది. వరి కోతలు ముమ్మరంగా కొనసాగడంతో పాటు కళ్లాల్లో వరినూర్పులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో చేతికి వచ్చిన ధాన్యాన్ని విక్రయించేంత వరకు రక్షించుకోవడం చాలా కీలకంగా మారింది. తగిన జాగ్రత్తలు పాటించకపోతే వచ్చిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో అన్నదాతలు అప్రమత్తం కావాల్సి ఉంది.

14 శాతానికి మించి తేమ ఉండకూడదు..

ఆహారానికి అవసరమైన ధాన్యం గింజలతో పాటు విత్తనాల కోసం కేటాయించిన ధాన్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని తెలిపారు. ధాన్యం అమ్మకాల అనంతరం రానున్న ఖరీఫ్ సీజన్ కోసం దాదాపు ఏడాది పాటు ధాన్యం గింజలను రక్షించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సహజంగా ధాన్యం రంగు మారే అవకాశం ఉంటుంది. సాధారణంగా కోతల సమయంలోనే ధాన్యంలో 20 శాతం మేర తేమ ఉంటుంది. పంట కోసిన తర్వాత మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజులు వరి పనలు ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గుతుంది. 14 శాతానికి మించి తేమ ఉంటే ధాన్యం బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. దీనిని ప్రధానంగా గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తడిచిన ధాన్యం ఆరుబయట బాగా ఆరబెట్టుకోవాలి. నిల్వ చేసే సమయంలో కూడా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి, నష్టం కలుగజేస్తాయి. ఎలుకలు కూడా ధాన్యాన్ని తినడమే కాకుండా, వాటి మల, మూత్ర విసర్జనలతో ధాన్యం కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

ముక్కుపురుగు..

పంట కోయడానికి ముందు నుంచే ముక్కుపురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి, అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థాలతో రంధ్రాన్ని మూసివేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్కుపురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్లచిలుక..

ధాన్యానికి వడ్లచిలుక ఆశిస్తే ధాన్యం చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వరి గింజలపై గుంపులుగా చేరి, గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుపోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరకముందే పై పొట్టులో చిన్నరంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తర్వాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది ధాన్యం మూటలు, వరి నిల్వచేసే గిడ్డంగుల్లో అధికంగా కనిపిస్తుంది.

నుసి పురుగు..

పుచ్చ పురుగు లేదా పెంకు పురుగుగా పేర్కొనే నుసి పురుగు గొట్టం ఆకారంలో చాలా చిన్నగా ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తర్వాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఈ తరహా కీటకాలు కలిగించే నష్టాలపై అవగాహన పెంచుకోవాలి.

ధాన్యం నిల్వచేసే పద్ధతి..

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెలను ఉపయోగించవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గొడౌన్లు వినియోగిస్తే పూర్తి రక్షణ ఉంటుంది. ఈ నిల్వ కేంద్రాల్లోకి కీటకాలు, తేమ, వర్షపునీరు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. ఎలుక రంధ్రాలు ఉంటే గాజుముక్కలు, సిమెంటుతో వాటిని పూడ్చివేయాలి. ధాన్యంనిల్వలకు కొత్త గోనెసంచులు ఉపయోగించడం మేలు. గోనెసంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేసి, ఒకరోజు ఎండబెట్టాలి. ఈ తరహా సంచులు వాడడం ద్వారా కీటకాల నుంచి ధాన్యాన్ని రక్షించవచ్చు.

ఎలుకల నుంచి రక్షణ ఇలా..

ధాన్యం నిల్వచేసే గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా ప్రతిరోజూ శభ్రం చేయాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి, ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింకు రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజుల పాటు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.

పండ్లతోటల పెంపకంపై రైతుల ఆసక్తి



పెద్దూరులో సాగు చేస్తున్న మామిడి తోట

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గొట్టివలస, గరుగుబిల్లి, ఉల్లిబద్ర, రావుపల్లి గ్రామాల్లోని రైతులు పండ్లతోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. మెట్టు పొలాల్లో మామిడి, జీడి, నీలగిరి తోటలు వేసేందుకు రైతులు ముందుకువస్తుండడం విశేషం. ఉలిబద్ర మీదుగా గరుగుబిల్లి వరకు జంఝావతి కాలువను ఏర్పాటు చేసినప్పటికీ సాగునీరు పుష్కలంగా సరఫరా కావడం లేదు. దీంతో రైతులు ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను పూర్తిస్థాయిలో సాగుచేయడం లేదు. వర్షాభావ సమయంలో నీటి తడులు అందకపోతే వరి పంటకు నష్టం జరుగుతుండడంతో పూర్తిస్థాయిలో పండించడం లేదు. మెట్టు భూముల్లో వేసిన గోగు పంట గిట్టుబాటు కాకపోవడంతో దాదాపు గోగుపంటను సాగు చేయడం లేదు. ఈ కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలైన నీలగిరి, పత్తి, పామాయిల్ తదితర పంటలతో పాటు పండ్ల తోటలను కూడా సాగుచేస్తున్నారు. ఈ పంటల వల్ల ఏటా పంట పెట్టుబడులు పెట్టనవసరం లేదని, దీంతో సాగు సులభంగా ఉందని రైతులు చెబుతున్నారు.

వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, కళాశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు)లోని విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార కేంద్ర నిర్వాహకురాలు పట్నాయకుని నాగమణి మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలు, హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. మనం కొనుగోలు చేసే ప్రతీ వస్తువు నాణ్యత, పరిమాణం, ధరలు, కాలం చెల్లిన తేదీ చూసుకోవాలని, వాటిల్లో తేడా ఉంటే సంబంధిత విక్రయదారుపై ఫిర్యాదు చేసేందుకు వినియోగదారుడు కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించి, న్యాయం పొందవచ్చన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ తరహా కోర్టులు ఉన్నాయన్నారు. రాతపూర్వకంగా గానీ ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నంబర్లు 1967, 18004250082 సంప్రదించి, ఫిర్యాదుపై సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అనంతరం వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్, వినియోగదారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో దేవీ సహిత జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ హోమం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ హోమం చేసిన వారికి సకల బాధలు తొలగిపోయి, మనసులో కోరిన కోర్కెలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

నీటమునిగిన పంటల పరిశీలన



వీరఘట్టం: రేగులపాడులో వర్షానికి తడిచిన వరి పనలపై ఉప్పుద్రావణం పిచికారీ చేయిస్తున్న ఏవో సౌజన్య, వ్యవసాయ సిబ్బంది

మిచాంగ్ తుపాను వర్షాలకు నీటమునిగిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది గురువారం పరిశీలించారు. పంట తడిచినా కాపాడుకోవచ్చని పలు సూచనలు, సలహాలు రైతులకు చేశారు. తడిచిన వరి పంటపై ఉప్పుద్రావణం పిచికారీ చేయాలన్నారు. లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి వరి పనలపై పిచికారీ చేయాలని, పత్తి పంట రక్షణకు లీటరు నీటిలో 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి స్ప్రే చేయాలని సూచించారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ పంట కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



భామిని: పెద్దదిమిలిలో పత్తి పంట రక్షణకు సూచనలిస్తున్న సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సీతారాం



పాలకొండ రూరల్: గొట్టమంగళాపురంలో నేలమట్టమైన వరి పంట పరిశీలనలో వ్యవసాయ సిబ్బంది



సీతంపేట: వర్షానికి తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు